సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 21 । జులై । 2023



గంగమ్మా..చల్లగా చూడమ్మా

రాజంపేటలోని బలిజపల్లెలో జరిగే గంగమ్మ జాతర సంబరం అంబరం అంటింది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. - 8లో



ఎర్రచందనం దుంగల స్వాధీనం

వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ పరిధిలో గొర్లపల్లె బీట్‌లో 35 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.బాల సుబ్రమణ్యం తెలిపారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.3 /25.1

జిల్లాలో గురువారం 25.1 – 31.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'స్టాఫ్ నర్సు'ల కౌన్సెలింగ్ సెంటర్ మార్పు

కడప రూరల్ : కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో ఈ నెల 21, 22 తేదీలలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామకానికి కౌన్సెలింగ్ జరగనుంది. కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌కు బదులుగా ఈ కౌన్సెలింగ్‌ను చెన్నై రోడ్డులో గల నూర్జహాన్ ఫంక్షన్ హాల్ (వైఎస్సార్ ఆడిటోరియం పక్కన)లో నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు మార్పును గమనించాలని ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని గవర్నమెంట్, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంటర్ వృత్తి విద్యా కోర్సు పూర్తి చేసి డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, కడప జిల్లా నోడల్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. స్పాట్ అడ్మిషన్లకు 24వ తేదీ కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎస్‌బీటీఈటీ.ఇన్/ఐవీసీ లేదా హెచ్‌టీటీపీఎస్://ఎస్‌బీటీఈటీఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సివిల్ సర్వీస్ కోచింగ్

కడప రూరల్ : అర్హులైన నిరుద్యోగ గ్రాడ్యుయేట్ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు గ్రూప్–1, గ్రూప్–2 సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలకు ఉచితంగా రెసిడెన్షియల్ కోచింగ్ పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. యూపీఎస్సీ వారిచే నిర్వహించే సివిల్ సర్వీసెస్‌కు విశాఖపట్నం, ఏపీపీఎస్సీ వారు నిర్వహించే గ్రూప్–1 కు విజయవాడ, గ్రూప్–2కు తిరుపతి స్టడీ సర్కిల్‌లో ఉచితంగా రెసిడెన్షియల్ కోచింగ్‌ను పొందవచ్చన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలు దాటకూడదని తెలిపారు. అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఏపీఎస్టీడీసీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్‌ను సందర్శించి, పోర్టల్‌లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తును పూరించాలని తెలిపారు. ఇందుకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆగస్టు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆకాశమే హద్దుగా ఆవిష్కరణలు సాగాలి

కురబలకోట : శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి రానున్న రోజుల్లో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో విద్యార్థుల పాత్ర గణనీయంగా ఉండాలని ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ పిలుపునిచ్చారు. గురువారం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవేర్‌నెస్ (స్టార్ట్) కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు.

చేనేతకు చేయూత

- నేతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు
- వైఎస్సార్ నేతన్న నేస్తంతో అండదండలు
- నేతన్నలకు యేటా రూ. 24 వేలు చొప్పున ఖాతాల్లో జమ
- జిల్లాలోని 9.446 మందికి రూ. 22.67 కోట్ల లబ్ధి
- నేడు ఐదో విడత సొమ్ము జమ చేయనున్న ముఖ్యమంత్రి



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి సంబంధించిన వివరాలు

సంవత్సరం	చేనేతల సంఖ్య	లబ్ధిపొందిన మొత్తం(రూ.కోట్లలో)
2019–20	10,184	24.44.16,000
2020–21	10,492	25,18,08,000
2021–22	8241	19,77,84,000
2022–23	8679	20,82,96,000
2023–24 (ప్రస్తుతం)	9446	22,67,04,000

కడప కోటిరెడ్డిసర్కిల్ : జనరంజక పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలకు కూడా ఆర్థిక అండగా నిలబడ్డారు. వైఎస్సార్ నేతన్న నేస్తంతోపాటు ముద్ర రుణాలతో చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చారు. అందువల్ల గతంలో మూలన పడిన మగ్గాలన్నీ మళ్లీ ప్రస్తుతం చప్పుడు చేస్తున్నాయి. వృత్తిని వదిలి వెళ్లిన నేతన్నలంతా ఇప్పుడు మగ్గాలపై దర్జాపై పనిచేస్తున్నారు.

ఏటా నేతన్నకు రూ. 24 వేల ఆర్థికసాయం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత వర్గాలను ఆదుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఓవైపు చేనేత పరిశ్రమను ప్రోత్సహించేందుకు పెట్టుబడి సాయం అందిస్తూనే మరోవైపు నిరంతర ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్ద రంగమైన చేనేత పరిశ్రమకు జవసత్వాలు నింపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఈ మేరకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద నెలకు రూ. 2 వేలు చొప్పున ఏడాదికి రూ. 24 వేలు అందిస్తోంది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రకటించిన షెడ్యూల్ మేరకు చేనేతలకు వైఎస్సార్ నేతన్న నేస్తం అందిస్తున్నారు. ప్రతి కుటుంబానికి రూ. 24 వేల నగదు సాయం అందుతోంది. ఇప్పటివరకు ఒక్కొక్క కుటుంబానికి రూ. 96వేల వరకు సాయం అందింది. తాజాగా ఐదో విడత సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ ద్వారా విడుదల చేయనున్నారు. 2023–24 సంవత్సరానికి గాను జిల్లాకు సంబంధించి ఐదవ విడత సాయం కింద 9446 మంది చేనేత కార్మికులకు రూ. 22.67 కోట్లను విడుదల చేయనున్నారు.

చేనేతలకు అండగా సీఎం



నాకు చేనేత మగ్గం తప్ప మరో ఆధారం లేదు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో కొంతమేర కోలుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఎంతో మేలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న మేలును మరువలేము. – వెంకటసుబ్బమ్మ, చేనేత కార్మికురాలు, కన్నెలూరు

మగ్గంపైనే జీవనం



మా కుటుంబమంతా మగ్గంపైన ఆధారపడి జీవనం సాగిస్తోంది. గతంలో నూలు, ఇతర సామగ్రి కొనుగోలుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేవాళ్లం. చీర పూర్తి కాగానే వచ్చిన మొత్తంలో వడ్డీలు కట్టుకుని మిగిలిన సొమ్ముతో కుటుంబ పోషణ చూసుకునే వాళ్లం. మా కష్టాలు తెలుసుకున్న సీఎం అధికారం చేపట్టిన నాలుగు నెలలకే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి ఏటా రూ. 24 వేలు అందించి ఆదుకుంటున్నారు. – చిట్టా కృష్ణవేణి, చేనేత కార్మికురాలు, సిద్దవటం

ఆర్థికసాయం సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద రూ. 24000 అందజేస్తోంది. వృత్తిలో భాగంగా ముడిసరుకులు కొనుగోలు, ఇతర అవసరాలకు ఈ సాయాన్ని వినియోగించుకోవాలి. ఐదవ విడత జిల్లాకు సంబంధించి 9446 మందికి రూ. 22.67 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది. – హరికృష్ణ, ఏడీ, చేనేత జౌళిశాఖ, కడప

స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలనకు కేంద్ర బృందం

డీపీఓ ప్రభాకర్‌రెడ్డి



కడప సెవెన్‌రోడ్స్ : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 లక్ష్యాల అమలును పరిశీలించేందుకు త్వరలో కేంద్ర బృందం జిల్లా పర్యటనకు రానుందని జిల్లా పంచాయతీ అధికారి ధనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర బృందం గ్రామ పంచాయతీలను సందర్శించనుందని తెలిపారు. కనుక జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌కు సంబంధించిన అంశాలను అమలు చేయాలని ఆదేశించారు. గ్రామం, పంచాయతీ, జిల్లా స్థాయిలో అందరూ ఎస్‌బీఎం (జి) 2.0, ఓడీఎఫ్ ప్లస్‌లో భాగస్వాములు కావాలన్నారు. గ్రామ పంచాయతీల మధ్య ఆరోగ్యకరమైన పోటీని కల్పించి విజేతలకు అవార్డులు ప్రకటించనున్నట్లు వెల్లడించారు. మొదటి దశ గ్రామ స్థాయిలో విలేజ్ సెల్ఫ్ అసెస్‌మెంట్, మండల స్థాయిలో పీర్ వెరిఫికేషన్, జిల్లా స్థాయిలో డైరెక్ట్ అబ్జర్వేషన్, జనాభా ప్రాతిపదికన 15 గ్రామ పంచాయతీలను జిల్లా నుంచి నామినేట్ చేయడం వరకు ఐదు దశలను పూర్తి చేశామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ బృందం హౌస్ హోల్డ్ స్థాయి, పబ్లిక్ ప్లేసెస్, గ్రామ స్థాయిలను పరిశీలించి మార్కులు కేటాయిస్తారన్నారు. జిల్లాలోని సర్పంచులు, అధికారులు, ఎస్ఎస్‌జీ లక్ష్యాలపై దృష్టి సారించాలని కోరారు. కేంద్ర బృందం క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చే నాటికి ఈ లక్ష్యాలను సాధించాలన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



సెంట్రల్ లైబ్రరీలో పర్యవేక్షిస్తున్న డైరెక్టర్ సంధ్యారాణి

ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి

వేంపల్లె : 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యా రాణి తెలిపారు. ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి సంబంధించి 1100 సీట్లు ఉండగా.. ప్రత్యేక కేటగిరీ మినహా 910 సీట్లకు ప్రవేశాలు ఈనెల 21, 22 తేదీలలో శుక్ర, శనివారాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆర్‌కేవ్యాలీ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కె.చెంచురెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయకుమార్‌ల చేతుల మీదుగా ఈ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు వారికి పంపిన కాల్ లెటర్లలో తెలిపిన విధంగా అన్ని ఒరిజినల్, నకలు సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, అందుకు సంబంధించిన ఫీజు తీసుకు రావాలని సూచించారు. అలాగే ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి ఈనెల 24, 25 తేదీలలో ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లోనే కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డైరెక్టర్ సంధ్యారాణి, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, డీన్ అకడమిక్ రత్నకుమారిలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వలంటీర్లు ఎన్నికల విధులకు దూరం

రాజకీయ పార్టీలతో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఎన్నికల నిర్వహణ విధులను ఎటువంటి పరిస్థితుల్లో సచివాలయ వలంటీర్లకు అప్పగించబోమని కలెక్టర్ విజయరామరాజు స్పష్టం చేశారు. ఎక్కడైనా బూత్ లెవెల్‌లో వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొన్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024పై నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జరుగుతోందన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి పౌరుడిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో రేషనలైజేషన్ ప్రక్రియ ముమ్మరం చేస్తున్నామన్నారు. అర్హులై ఉండి ఇంకా ఓటరుగా నమోదు కాని వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. వారం రోజులపాటు బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు, డెలిషన్ ప్రక్రియలను చేపడతారన్నారు. ఓటర్లు తమ పేర్లలో, కుటుంబ సభ్యుల పేర్లలో, వయస్సులో, చిరునామాలో తేడాలు ఉంటే సవరించుకోవాలని సూచించారు. ఓటరు నమోదు, డెలిషన్ అవకాశాన్ని అక్టోబరు 16వ తేదీ వరకు వినియోగించుకోవచ్చన్నారు. అక్టోబరు 17న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. అదేరోజు నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి విచారిస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ ఓటర్ల తుది జాబితా విడుదలవుతుందన్నారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ, బీఎస్పీ, బీజేపీ నాయకులు జనార్దన్‌రావు, కానుగ దానం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రొద్దుటూరు వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ 2, 3 సంవత్సరాల సెమిస్టర్ ఫలితాలను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వర‌రెడ్డి, వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి. నాగరాజు, డీన్ కె.వి. రమణయ్యలతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బీటెక్ మూడో సంవత్సరం 6వ సెమిస్టర్ సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీలో 90.7 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బీటెక్ రెండో సంవత్సరం 4వ సెమిస్టర్ ఫలితాల్లో 81.13 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. బీటెక్ సెకండియర్ 4వ సెమిస్టర్ ఫలితాల్లో 58.09 శాతం మంది, బీటెక్ 3వ సంవత్సరం 6వ సెమిస్టర్ ఫలితాల్లో 85.19 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విభాగాల విద్యార్థులను అభినందించారు. అదే విధంగా వైవీయూలోని ఫైన్‌ఆర్ట్స్ ప్రథమ సంవత్సరం సెమిస్టర్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫలితాలను సకాలంలో విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. ఫలితాలు కళాశాలల్లో అందుబాటులో ఉంటాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ విభాగం సహాయ అధికారులు డాక్టర్ ఆదినారాయణరెడ్డి, డాక్టర్ సుమిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు





ప్రొద్దుటూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి తానేటి వనిత, వేదికపై ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి తదితరులు, సభకు హాజరైన జనం

- ఈ జిల్లాలో పుట్టడం మీ అదృష్టం
- కడప జిల్లా అనగానే వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకు వస్తారు
- రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత

ప్రొద్దుటూరు : 'రాష్ట్రంలో జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోంది.. ప్రతి కుటుంబంలో అన్నలా, తమ్ముడిలా, కొడుకులా, మనవడిలా ఉంటూ ముఖ్యమంత్రి ప్రజల అవసరాలను తీరుస్తున్నారు'.. అని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు.ప్రొద్దుటూరు పట్టణంలో గురువారం ఆమె కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్రపాడురోడ్డులోని రాచమల్లు వారి రాజన్న భోజనం క్యాంటిన్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. కడప జిల్లా అనగానే మహానేత రాజశేఖరరెడ్డి గుర్తుకు వస్తారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఆయన బాధ్యతలను జగనన్న స్వీకరించారన్నారు. కడప జిల్లాలో అడుగు పెట్టగానే మనసంతా పులకరించి పోయిందన్నారు. ఈ జిల్లాలో పుట్టడం మీ అందరి అదృష్టమని, ఏ గడపకు వెళ్లి అడిగినా ఈ విషయాన్ని చెబుతారన్నారు. పులివెందుల పులిబిడ్డగా వచ్చి ఎంత మంది ఎన్ని కుట్రలు పన్నినా చిరునవ్వుతో స్వీకరించి రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేయడంతోపాటు వడ్డీ చెల్లించారన్నారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేశారన్నారు. ప్రత్యేకంగా అగ్రవర్ణాల కోసం ఈబీసీ, కాపు నేస్తం పథకాలను అమలు చేశారని చెప్పారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావించి విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నారని వివరించారు.

దేశంలో మహిళా హోం మంత్రిని నేనే

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా దళిత మహిళనైన తనను జగనన్న హోంశాఖ మంత్రిగా నియమించారని తానేటి వనిత పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఆయా రాష్ట్రాల హోంశాఖ మంత్రుల సమావేశంలో తాను ఈ విషయాన్ని గమనించానన్నారు. జగనన్న మహిళలకు ఇచ్చే గౌరవం, నమ్మకం ఇదన్నారు.

జగనన్న సింహంలా సింగిల్‌గా వస్తాడు

2024 ఎన్నికల్లో ఓట్ల కోసం ఆయా రాజకీయ పార్టీలు గుంపులు గుంపులుగా ప్రజల ముందుకు వస్తాయని మంత్రి పేర్కొన్నారు. జగనన్న సింహంలా సింగిల్‌గా వస్తారన్నారు. 2019 తరహా ఎన్నికల్లాగానే ప్రజలు ఆయనకు మద్దతు పలకాలని కోరారు.

రాజన్న భోజనం ఏర్పాటు హర్షణీయం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంత డబ్బుతో రాచమల్లు వారి రాజన్న భోజనం క్యాంటిన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని హోంమంత్రి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రాచమల్లు శివప్రసాదరెడ్డిని లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు.

ప్రతి ఇంటికీ లబ్ధి : మంత్రి ఆదిమూలపు సురేష్

జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలోని 5.70 కోట్ల మందికి ఏదో విధంగా మేలు జరిగిందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. ఆయా సామాజిక వర్గాలు తమ సామాజిక వర్గానికి ఈ ప్రభుత్వంలో మేలు జరిగిందా లేదా అనే విషయాన్ని గమనించాలని కోరారు. ప్రతి విషయంలోనూ జవాబుదారితనంతో, అవినీతి రహితంగా, పారదర్శకంగా, జనరంజక పాలన సాగుతోందని మంత్రి తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నారు. గుంపులు గుంపులుగా అధికారులు ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని పరిచయం చేసింది
వైఎస్సార్‌సీపీ జెండానే

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి అభివృద్ధిని పరిచయం చేసింది వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండానేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా ఈ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని అన్నారు. వారానికోమారు తాగునీరు వచ్చే పరిస్థితి ఉండేదని, ట్యాంకర్లతో నీరు తెచ్చుకునే వారన్నారు. ఎన్నో సందర్భాల్లో కుళాయిల వద్ద మహిళలు కొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రూ.150 కోట్లతో అమృత్ పథకాన్ని నిర్మించి 30 కిలోమీటర్ల దూరంలోని మైలవరం డ్యాం నుంచి నీరు పైపులైన్ ద్వారా తీసుకొచ్చి శుద్ధి చేసిన తర్వాత సరఫరా చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో నీటి సమస్య రాదన్నారు. ఈ పథకాన్ని పూర్తి చేసి ఘన విజయాన్ని సాధించామన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో నియోజకవర్గంపై సవతి తల్లి ప్రేమను చూపారన్నారు. రోజూ ప్రజలకు నీరు ఇవ్వకుంటే 2024 ఎన్నికల్లో పోటీ చేయనని ప్రజలకు హామీ ఇచ్చానని, ఇచ్చిన హామీ మేరకు నీటి పథకం పూర్తి చేశానన్నారు. డ్రైనేజీ కాలువల ఆధునీకరణకు రూ.160 కోట్లను సీఎం జగన్ మంజూరు చేశారన్నారు. తాగునీటి పైపులైన్ కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసిందన్నారు. రూ.65 కోట్లతో వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో అభివృద్ధి చేపడుతున్నామని, రూ.5 కోట్లతో నూతన ఆర్టీసీ బస్టాండ్, రూ.4.6 కోట్లతో మున్సిపల్ గాంధీ పార్కును నిర్మించామన్నారు. రూ.53 కోట్లతో పెన్నానదిపై బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. రూ.24 కోట్లు ఎస్‌సీఎన్‌ఆర్ కళాశాల అభివృద్ధికి నిధు లు మంజూరయ్యాయన్నారు. మైదుకూరు రోడ్డును నెక్లెస్ రోడ్డుగా తీర్చిదిద్దేందుకు స్మార్ట్ స్ట్రీట్ పనులకు భూమి పూజ చేశామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డుల్లో రూ.93 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో జానెడు స్థలం ఇవ్వకపోగా తమ ప్రభుత్వంలో 24వేల మంది పేదలకు ఇళ్లు మంజూరు చేసి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు మంజూరు చేశామన్నారు. ఈ డిసెంబర్ నాటికి 14వేల ఇళ్లను పూర్తి చేస్తామని తెలిపారు. పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా అందరికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. చంద్రబాబు పరిపాలన, జగన్ పరిపాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అభివృద్ధి చేసి ఉంటేనే తమకు ఓటు వేయాలని ముఖ్యమంత్రి జగన్, నియోజకవర్గంలో తాను ప్రజలను కోరుతున్నామన్నారు.

11 ఏళ్లపాటు నిర్విరామంగా రాజన్న క్యాంటిన్

రాచమల్లు వారి రాజన్న భోజనం క్యాంటిన్‌ను 11 ఏళ్లపాటు నిర్విరామంగా నడిపిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రోజూ పట్టణానికి ఎంతో మంది వస్తుంటారని, ఆటో కార్మికులు, వివిధ దుకాణాల్లో పనిచేసే కూలీలు, ఆయా వర్గాలకు చెందిన కార్మికులతోపాటు పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఈ క్యాంటిన్‌ను తన సొంత డబ్బుతో ఏర్పాటు చేశానన్నారు. వ్యాపారులు చందాలు ఇస్తామని చెప్పినా తీసుకోలేదన్నారు.

క్లుప్తంగా

కారును ఢీకొన్న లారీ



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

కొండాపురం : కొండాపురం సమీపంలోని తాడిపత్రి– కడప జాతీయరహదారిపై గురువారం లారీ కారును ఢీ కొంది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్‌కావడంతో వాహనంలోని వారికి ప్రాణాపాయం తప్పింది. గాలివీడు మండలం ఒరిగుపల్లెకు చెందిన ఫణికుమార్ భార్య పావనితో కలసి కారులో అనంతపురానికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొండాపురం సమీపంలోని లక్ష్మీనరసింహ వేర్ హౌస్ ఎదురుగా ఉన్న మలుపు వద్ద వెళ్తుండగా కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్నవారు సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో వాహనంలోని ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ అయి సురక్షితంగా బయటపడ్డారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గొర్రె

పోరుమామిళ్ల : మండలంలోని వెంకటాపురం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ గొర్రె మృతి చెందింది. గ్రామస్తులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంకటాపురంలో ప్రధాన రహదారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గ్రామానికి చెందిన కమ్మనెత్తి పెద్ద ఓబులేసు గురువారం రాత్రి 7 గంటల సమయంలో గొర్రెలు తోలుకుని ఇంటికి వెళుతుండగా.. ఓ గొర్రె ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి వెళ్లింది. షాక్ తగిలి చనిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ ప్రసారం అవుతున్నట్లు గ్రహించిన గ్రామస్తులు మిగతా గొర్రెలు అటుగా వెళ్లకుండా పక్కకు తోలారు. అటు వైపుగా జనం వెళ్లకుండా అప్రమత్తం చేశారు. ఆ తర్వాత విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

గంగమ్మా.. చల్లగా చూడమ్మా

- అంబరమంటిన బలిజపల్లె జాతర సంబరం
- దారులన్నీ వేడుకవైపే
- వేకువజాము నుంచి రాత్రి దాకా పోటెత్తిన జనం



బలిజపల్లెలో కిక్కిరిసిన భక్తులు



జాతరలో భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మ



జాతరలో పాల్గొన్న మేడా, ఆకేపాటి

రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లెలో గురువారం జరిగిన గంగమ్మ జాతర సంబరం అంబరమంటింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే జాతర వేడుక ప్రారంభమైంది. ముందుగా జాతర నిర్వహణలో భాగస్వామ్యులైన నారపురెడ్డిపల్లె ప్రజలు పోతురాజును ఊరేగిస్తూ అమ్మవారికి నవధాన్యాలు తీసుకొచ్చారు. అనంతరం తుమ్మల అగ్రహారం మహిళలు గంగమ్మకు గండదీయలు తీసుకొచ్చారు. పై రెండు గ్రామాల ప్రజలు బలిజపల్లెకు చేరుకోవడం, ఈలోపు అమ్మవారి ప్రతిమ తయారు కావడంతో నిర్వాహకులు పూలరథంలో గంగమ్మను ఊరేగిస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన వేపమండల గుడిలో కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులు గంగమ్మకు ఇష్టమైన నైవేద్యాలను ఎదురుగుంభంగా సమర్పించి, గంగమ్మా..మము కరుణించమ్మా.. అంటూ వరపడ్డారు. అనంతరం అమ్మవారు గుడిలో కొలువుదీరగానే జాతర మరింత రద్దీగా మారింది. అప్పటికే దాదాపు కిలోమీటరు దూరం వరకు క్యూలైన్లో నిల్చునిఉన్న ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు త్వరపడ్డారు. ఈ సమయంలో భక్తులను అదుపుచేసేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. తుమ్మల అగ్రహారం మహిళలు తీసుకొచ్చిన గండదీయలను అమ్మవారికి చెల్లించగానే పోలీసు అధికారులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు.

దారులన్నీ జాతరవైపే

బలిజపల్లె గంగమ్మ జాతరలో అమ్మవారికి వరపడితే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందువల్ల రెండు దశాబ్దాలుగా ఇక్కడి గంగమ్మ ఎంతో విశిష్టత సంతరించుకుని విరాజిల్లుతోంది. ఈ ఏడాది జాతర నిర్వహణ ఆలస్యమైనప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు పెద్దసంఖ్యలో వేడుకకు తరలివచ్చారు. బుధవారం రాత్రి నుంచే భక్తులు బలిజపల్లె గ్రామానికి వెళ్ళేందుకు ఉన్న నాలుగువైపులదారుల నుంచి రావడం మొదలుపెట్టారు. అప్పటినుంచి గురువారం రాత్రి దాకా దారులన్నీ జాతరవైపే సాగాయి. జాతరకు వచ్చిన జనంతో పట్టణంలో కూడా ఎటుచూసినా భక్తులే సందడే కనిపించింది.

గంగమ్మను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

జాతర సందర్భంగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మను ఏటా జాతరలో దర్శించుకునే భాగ్యం కలుగుతుండటం పూర్వజన్మ సుకృతమని వారు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రజారంజక పాలనకు గంగమ్మ తల్లి ఆశీస్సులు మరింత మెండుగా ఉండాలని, సంవృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు సుఖ సంతోషాలు కలిగించాలని అమ్మవారిని వేడుకున్నట్లు మేడా, ఆకేపాటి, పోలా తెలిపారు.

భక్తుల ఆకలి, దాహార్తిని తీర్చిన మానవతా మూర్తులు

జాతర సందర్భంగా అనేక మంది మానవతా మూర్తులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. గంగమ్మ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు బలిజపల్లె పరిసర ప్రాంతాల్లోనే కాక పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భోజనం, పులిహోర వంటి ఆహార పదార్థాలను అందజేశారు. మరికొంత మంది మజ్జిగ, మంచినీరు, పానకం పంపిణీ చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

కేబుల్ ఆపరేటర్లను దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : టీవీ సరిగా రావడం లేదని రిపేర్ కోసం కేబుల్ ఆపరేటర్లు వెళ్లగా అతడిని ఇంటి యజమాని దూషించడంతో అతడిపై కేబుల్ ఆపరేటర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప నగరం తాలూకా పోలీసుస్టేషన్ పరిధి రవీంద్రనగర్‌లో హాజీవలీ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. వారి ఇంట్లో టీవీ రాకపోవడంతో రిపేరు కోసం నెట్–9 కేబుల్ ఆపరేటర్లు బాలాజీ, వంశీ వచ్చారు. వారితో హాజీవలీ మాట్లాడుతూ మీ నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయదని, మీ మేనేజర్‌ను పిలిపించాలని, లేకుంటే చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై నెట్–9 కేబుల్ నెట్‌వర్క్ మేనేజర్ రామోజీబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

నగరంలో చోరీ

కడప తాలూకా పోలీసుస్టేషన్ పరిధి విజయనగర్ కాలనీలో నివాసముంటున్న వారం శేషగిరి ఇంట్లో పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఇంటి తాళం పగులగొట్టి రూ. 1000 అపహరించినట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీహార్‌వాసిపై కేసు నమోదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీహార్ రాష్ట్రం దర్భాంగకు చెందిన షకీల్‌బిన్ హనీఫ్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సిద్ధయ్య తెలిపారు. షకీల్‌బిన్ హనీఫ్ మహ్మద్ ప్రవక్త బోధనలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తూ ముస్లిం వర్గంలో అంతర్గత సంఘర్షణలకు కారణమవుతున్నాడని నగరానికి చెందిన మత పెద్దల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

అదుపు తప్పి ఆటో బోల్తా



మృతి చెందిన రామయ్య



గాయపడ్డవారిని పరామర్శిస్తున్న వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : పులివెందుల – రాయచోటి బైపాస్ రోడ్డులో గురువారం ఆటో అదుపు తప్పి బోల్తా పడ్డ ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందగా, 14 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. వేంపల్లె మండలం కుప్పాలపల్లె గ్రామానికి చెందిన 18మంది వ్యవసాయ కూలీలు గురువారం ఉదయాన్నే పని నిమిత్తం ఆటోలో నేలవరం తాండా పొలాలవైపు బయలుదేరారు. వేంపల్లె బైపాస్ రోడ్డులో ఆటో వెళ్తుండగా పంది అడ్డుగా వచ్చింది. అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కుప్పాలపల్లెకు చెందిన టి.రామయ్య(75) అక్కడికక్కడే మృతి చెందగా, 14 మంది వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. స్థానికులు 108 సాయంతో గాయపడ్డవారిని వేంపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో అజిత్, పుల్లయ్య, శివసాయి దత్తు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వైద్యుల సూచన మేరకు వారిని మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం గురించి తెలుసుకున్న వేంపల్లె జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ఎల్వీ ప్రసాద్‌రెడ్డి, బంకా సోమేశ్వర రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

బి.కొత్తకోట : మండలంలోని జాతీయ రహదారి తుమ్మనంగుట్ట రైల్వేస్టేషన్ వద్ద బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వృద్ధులు తీవ్రంగా గాయపడ్డారు. ములకలచెరువు మండలం గంద్రాజులపల్లెకు చెందిన ముకుందరాజు (65), రామకృష్ణరాజు (68) గురువారం బైక్‌పై గ్రామం నుంచి మదనపల్లె వైపు వెళ్తున్నారు. వీరు తుమ్మనంగుట్ట రైల్వేస్టేషన్ సమీపంలోని రాగానే మదనపల్లె నుంచి ములకలచెరువు వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వృద్ధులకు తీవ్రగాయాలు కాగా వారిని చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : నందలూరు–రాజంపేట మధ్య ఉన్న చెయ్యేరు బ్రిడ్జిపై గురువారం స్కూటీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణించిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. నందలూరు పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడ్డవారిని 108 వాహనంలో రాజంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆటో ఢీకొని..

మదనపల్లె : ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. అమ్మచెరువుమిట్ట జగన్‌కాలనీకి చెందిన ఎస్.బాబాజాన్(56) ద్విచక్రవాహనంపై వెళుతుండగా తట్టివారిపల్లె సమీపంలో ఆటో వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాబాజాన్‌ను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేరుకే ఆదర్శ గ్రామం..అన్నీ సమస్యలే



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : గత టీడీపీ పాలనలో పోట్లదుర్తి గ్రామాన్ని ఆదర్శగ్రామంగా టీడీపీ నేతలు ప్రకటించుకున్నారని, ఇప్పుడు ఆ ఊరు దిబ్బగా మారి పేరుకు మాత్రమే ఆదర్శ గ్రామంగా ఉందని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం పోట్లదుర్తిలో జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, కనీసం కాలువల్లో పూడికలు కూడా తీయడంలేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందిస్తూ శానిటేషన్ వర్కర్లు కొరతగా ఉన్నట్లు సభకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేజర్ పంచాయతీ అయిన పోట్లదుర్తిలో వర్కర్లు తక్కువగా ఉండటం ఏంటని ప్రశ్నించారు. వెంటనే బయట నుంచి వర్కర్లను తెప్పించుకుని కాలువల్లో పూడికలు తీయాలని అధికారులను ఆదేశించారు. ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందినా కూడా పోట్లదుర్తిలో సమస్యలు ఉన్నాయా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అనంతరం పలువురు ఇళ్లు, రేషన్, పింఛను సమస్యల గురించి ఎమ్మెల్యేకు తెలియజేశారు. వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే గ్రామ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, ఎంపీటీసీ సభ్యులు రమణారెడ్డి, శివప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, క్రిష్ణంరాజునాయక్, నాయకులు సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టాటాఏస్ బోల్తా.. 8 నెలల బాలిక దుర్మరణం



వాహనం కిందపడి మృతి చెందిన చిన్నారి

చాపాడు : మండల పరిధిలోని నాగులపల్లె వద్ద మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో గురువారం టాటాఏస్ బోల్తా పడ్డ ఘటనలో 8 నెలల బాలిక మృతి చెందింది. అనంతపురం జిల్లా బత్తలపల్లెకు చెందిన వలస జీవుల కుటుంబం గురువారం పులివెందుల నుంచి బద్వేలుకు టాటాఏస్‌లో వెళుతుండగా నాగులపల్లె వద్ద బోల్తా పడింది. స్థానికులు వాహనంలో ఇరుక్కుపోయిన వారిని వెలికితీశారు. ప్రమాదంలో 8 నెలల పాప మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి.

ఆధిక్యంలో చిత్తూరు జట్టు



ఐదు వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ బ్రహ్మసాయి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ–సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 29 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండోరోజు గురువారం 61.3 ఓవర్లలో 252 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్లు అర్జున్ 92 పరుగులు, పవన్ రిత్విక్ 77 పరుగులు చేసి రాణించగా, చిత్తూరు బౌలర్ బ్రహ్మసాయి 5 వికెట్లతో మెరిశాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 341 పరుగులు చేసిన చిత్తూరు జట్టు సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి రెండోరోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు 203 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. జట్టులోని భవానీప్రసాద్ 46, రెడ్డిరుషీల్ 48 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ భార్గవ్ మహేష్ 3 వికెట్లు తీశాడు.

కర్నూలు జట్టుకు స్వల్ప ఆధిక్యం

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 95 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు రెండోరోజు 82.1 ఓవర్లలో 321 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని దినకర్ 94, కరీంబాబా 66, లీలాసాయి 48 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో దినేష్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. జట్టులోని సాయి సూర్యతేజారెడ్డి 67 పరుగులతో రాణించాడు. అనంత బౌలర్ ప్రదీప్ 2, లీలాసాయి 2 వికెట్లు తీశారు. దీంతో కర్నూలు జట్టు 2 పరుగుల స్వల్ప ఆధిక్యంతో కొనసాగుతోంది.

35 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడ్డ వ్యక్తులు, ఎర్రచందనం దుంగలను చూపిస్తున్న అటవీశాఖ అధికారులు

వేంపల్లె : వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ పరిధిలో గొర్లపల్లె బీట్‌లో 35 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.బాల సుబ్రమణ్యం గురువారం తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం రాత్రి గొర్లపల్లె అటవీ ప్రాంతంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. మొత్తం ఏడుగురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా దాడి చేశామన్నారు. వారిలో ఒకరు పారిపోగా మిగిలిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వెన్నపూస చంద్రశేఖరరెడ్డి అనే వ్యక్తి తప్పించుకోగా.. ఏకసిరి గంగయ్య, వై.పెద్ద గంగయ్య, ఒబిలగండ్ల నడిపి ఓబయ్య, నాగూరు లక్ష్మిరెడ్డి, త్రిపురవరం నరసింహారెడ్డి, బుసిరెడ్డి అమరేంద్రరెడ్డిలను అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి 35ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు 597కేజీలు ఉన్నాయని, వీటి విలువ రూ.1.65లక్షలు ఉంటుందన్నారు. దుండగుల నుంచి ఒక ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనపరుచుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎర్రచందనం దుంగలను కడప రేంజర్ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గుర్రప్ప, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతోనే షామీర్‌బాషా మృతి

నిమ్మనపల్లె: మండలంలోని కొండయ్యగారిపల్లెకు చెందిన ఎస్.షామీర్‌బాషా (45) అనారోగ్య కారణాలతోనే మృతి చెందినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసే షామీర్ బాషా (45) సారా తాగి మృతి చెందినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయితే తన తండ్రి అనారోగ్యంతోనే మృతి చెందినట్లు షామీర్‌బాషా కుమారుడు నవాజ్‌వల్లి నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారం రోజులుగా తన తండ్రి తీవ్ర జ్వరం, కడుపునొప్పితో బాధపడుతూ ఆహారం తీసుకోలేక పోతుండడంతో బుధవారం నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తీసుకెళ్లినట్లు చెప్పారు. వైద్యులు మదనపల్లె ఆస్పత్రికి రెఫర్ చేయగా, అక్కడ పరీక్షించిన వైద్యులు దారిలోనే చనిపోనట్లు నిర్ధారించారని చెప్పారు.

జర్నలిస్టులను దూషించిన వారిపై ఫిర్యాదు



అర్బన్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

బద్వేలు అర్బన్ : జర్నలిస్టులను తరిమి తరిమి కొడతాం .. అంటూ వ్యాఖ్యలు చేసిన దళిత సంఘాల నాయకులపై బద్వేలు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు గురువారం అర్బన్ ఎస్‌ఐ కె.వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బి.వెంకటేష్, ఎ.క్రిష్ణకిషోర్, పి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు పదేళ్ల క్రితం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల సమీపంలో ఏర్పడిన రహదారి సమస్యపై రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్న సమయంలో సంబంధం లేని దళిత సంఘాల నాయకులు జర్నలిస్టులను దుర్భాషలాడటం తగదన్నారు. పోలీసులు వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు కె.సాంబశివరావు, పూలబాబు, రాజన్న, సురేష్, మస్తాన్‌రెడ్డి, ప్రసాద్, అరుణ్, రఘు, శివ, కె.పి.ఎం.భాస్కర్, వెంకటేశ్వర్లు, జయప్రసాద్, వెంకటసుబ్బయ్య, హర్షబాబు, హుస్సేన్, మైఖేల్, రాజు, వెంకటసుబ్బయ్య, బాబు, కిషోర్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాలి వానకు నేలకూలిన భారీ చింత చెట్టు



చెన్నూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విరిగిపడ్డ భారీ చింత చెట్టు

చెన్నూరు : చెన్నూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మధ్యాహ్నం గాలి వానకు భారీ చింత చెట్టు నేలకూలింది. ఆ సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు కూలడంతో పాఠశాల రూఫ్ కొంత మేర దెబ్బతింది. చెట్టు కొమ్మలుపడి విద్యార్థుల సైకిళ్లు దెబ్బతిన్నాయి. డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, అడిషనల్ డైరెక్టర్ దేవరాజు, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఎంపీడీఓ సురేష్‌బాబు, సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాఠశాలకు వెళ్లి విరిగిన చింత చెట్టును పరిశీలించారు. ఎంఈఓ గంగిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.